# మస్తుగుందిరాపోరి !

ఈ రోజుల్లో ఆడపిల్లలనుకననే కూడదు! కంటిమిపో.... చదివించకూడదు! చదివించితిమిపో.. ఉద్యోగాలు చేయించకూడదు... చేయించితిమిపో.... తల్లిదండ్రుల చావుకొచ్చుచున్నది కదా హతవిధీ!

ఏ రోజు న్యూస్ పేపర్ చూసినా టీచర్లు విద్యార్థినులపై అఘాయిత్యాలు... ఉద్యోగినులపై లైంగిక వేధింపులు... యువతిపై గొడ్డలితో దాడి... మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన వుదంతం!..పసి పిల్లని పాశవికంగా అనుభవించి గొంతు పిసికి రోడ్డు పక్కకు విసిరేసిన ఘాతకచర్య... ఇవేగా ముదరష్టపు వార్తలు!

ఇలాంటి న్యూస్‌రోజూ పేపర్లో ప్రింటవుతూంటే ఆడ పిల్లలను కనాలంటే ఏ పేరెంట్‌కి మనసొప్పుతుంది?

ఆడ పిల్లల తండ్రులు మానసిక క్షోభ ఎలా వుంటుందో వూహించటం వర్ణనాతీతం!

ఇవి చాలదన్నట్టు... అడ పిల్లల అపహరణలు... కిడ్నాపులు... అమ్మేయటాలు... బెదిరింపులు! హే భగవాన్ పగవాడి క్కూడా వద్దు ఈ చెర అన్పించక మానదు.

నేటి తరం ఆడవాళ్లు బ్రతుక భయంతో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకు జీవిస్తున్నారు.

వంటరిగా ఆడపిల్ల అర్ధరాత్రి రోడ్డుమీద నడవడం గురించి చాలాదూరం ఆలోచించాడు గాంధీజీ! నేటి వ్యవస్థలో వున్న ఆడపిల్లల అవస్థవూహించే వుంటే ఆమాటని మరోవిధంగా వ్రాయటానికి పూనుకునేవారు.

పోన్లే.. కిడ్నాప్ చేసిన వారు..ఎత్తుకెళ్లింది కేవలం డబ్బు కోసమేనా అంటే అదీ లేదు. గొంతు పిసికో ... గొడ్డళ్లతో నరికో.. తుపాకీతో కాల్చో.... దారుణంగా .... కిరాతకగా హత్య చేస్తారు..

ఇదిట్లావుండగా... లక్షల కట్నాలిచ్చి పెళ్లి చేసి అత్తవారింటికి పంపినా ఆడపిల్ల సుఖపడుతుందన్న నమ్మిక లేకుండా పోతోంది. 'సెక్సువల్‌పర్‌వర్షన్'తో భర్త భార్యని హింసించో...కట్నం చాల్లేదని పుట్టింటికి పోయి తెమ్మనో.. మరోదానికో మరోదానికో ఇటు భర్త అటు అత్తమామలు పెట్టే హింస... అదొక ప్రత్యక్ష నరకం! కన్నవారిని వేదనకు... క్షోభకి గురి చేస్తుంది.

రియల్ ఎస్టేట్ బిగ్ బిజినెస్ మేగ్నెట్ అచ్చిరెడ్డికి ఒక్కగా నొక్క కూతురు అనుష్క! తల్లిదండ్రుల గారాల పట్టి! ఆయింటి లక్ష్మి.

తెలివిలో... అందంలో.... చదువులో... అన్నింటా తనకు తానే సాటి. ఈ మెరుపుతీగె.... తన రూప లావణ్యంతో.. వొంపులవయ్యారాలతో...అందచందాలతో..అందరినీ పీడించటం అనుష్కకి భలే సరదా! ఎలాంటి వారినైనా పిల్లిమొగ్గ వేయించగల దిట్ట! మగాళ్లపల్స్ రేటు...హార్ట్ బీటు ఎరిగిన జవ్వని... తనను చూడగానే ఎదుటి మగవాడిలో బి.పి. ఎంత వేగంగా పెరుగుతుందో...శరీరంలో కరెంట్ ఎంత స్పీడులో ప్రవహిస్తుందో అంచనా వేయగలదు.

కోట్లకి పరుగెత్తిన వాడికి కూతురు కాబట్టి కారుదిగి కాలుబైటపెట్టదు. అనుష్క స్టైలు...స్టేటస్ చూచి తోటివారు నోరు వెళ్ల బెట్టాల్సిందే.

రోజుకి నాలుగు రకాల డ్రెస్సులు... అరు రకాల హెయిర్‌స్టైల్స్...నాలుగు రకాల చెప్పులు...మూడు రకాల కూలింగ్ గ్లాసెస్ మార్చటం అలవాటు అనుష్కకి.

వారానికో కలర్ నెయిల్‌పాలిష్....రెండు రోజుల కొక లిపిస్టిక్ రంగు... డ్రస్సు....మేకప్‌లోపోటీ మారే బంగారు ఆభరణాలు...అనుష్కని చూడటానికి రెండు కళ్లు అనుభవించటానికి జీవితకాలం చాలదన్పిస్తుంది.

పెద్ద చిన్న....వున్నవారు...లేనివారు అనుష్కను చూస్తూ లొట్టలేస్తూ గుటకలు మింగక తప్పదు.

డిగ్రీకాగానే చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టి...తండ్రి వద్దని వారిస్తున్నా...పిచ్చి వేషాలెందుకేని తల్లిమొత్తుకుంటున్నా...పెడిచెవిన పెట్టి అందాల పోటీలో పాల్గొనటం...రేంప్‌షోలో పార్టిసిపేట్ చేయటం...మోడలింగ్ చేయటంవంటి కళల్లో చురుగ్గా పాల్గొంటూ వస్తోంది.

ప్రొడ్యూసర్లు...డైరక్టర్లు...సినీమాల్లో నటించల్సిందిగా అభ్యర్థిస్తూ రాత్రింబవళ్లు వెంటతిరిగినా...ఆస్టాల్ అని తిరస్కరించేసింది.

పబ్‌కి వెళ్లినప్పుడు చీకటి వాతావరణంలో అనుష్కకు ఎందరో దగ్గరవ్వాలని... తాకాలనీ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. చెంప ఛెళ్లు మన్పించి బీకేర్‌ఫుల్ అంటూ కళ్లెర్రచేసేది. కాలి షూ తీసి కొట్టబోయేది.

అందుకే అనుష్కతో చేతులు కలిపి..స్టెప్స్‌వేయాలంటే చాలా మందికి గుండెదడ. ధైర్యం చేయటానికి సంశయిస్తారు. గుండెలో రైళ్లు పరుగెడతాయ్.

అనుష్కముందు ఐశ్వర్యారాయ్ దిగదుడుపు. ఆంధ్రాబ్యూటీ కిరీటాన్ని కైవశం చేసుకుంది. మరుసటి సంవత్సరం మిస్ ఇండియా బిరుదు. అనుష్క కీర్తి కిరీటంలో మరొక కలికితురాయిగా నిలిచింది.

టాలివుడ్ వద్దనుకున్నా... బాలివుడ్ దర్శకనిర్మాతలు కోట్లు కుమ్మరిస్తా మంటూ వెంట తిరిగారు. సున్నితంగా వారి కోరికనూ తిరస్కరించింది.

తాను కోట్ల ఆస్తికి ఏకైక వారసురాలు! అలాంటి అనుష్కకు కోట్ల సంపాదనపై ఆశలేదు.

ఆమె చూపంతా ప్రపంచ సుందరి పోటీల్లో నెగ్గాలనే మార్గంవైపే...

ప్రపంచ సుందరి పోటీలో ఎలాగైనా నెగ్గాలని. నెగ్గి కీర్తి కిరీటాన్ని ధరించాలి! హాలివుడ్ దర్శకులను తన చుట్టూ తిప్పుకోవాలి! అదే తన జీవిత లక్ష్యం!

'ఏజ్ మీద పడుతోంది... నీ మేరేజ్ సంగతి ఆలోచించితివా తల్లీ...' అని తండ్రి ఎన్నిసార్లు గడ్డంపుచ్చుకుని బ్రతిమాలినా...అచ్చి రెడ్డికి నిరాశే ఎదురైంది.

'నీకు ఎంత తోస్తే అంతేనా.... ముసల్దానివైన తర్వాత...నీ వెంతటి అందగత్తెవైనా..కోటీశ్వరుడి కూతురివైనా..నిన్ను పెళ్లాడేటందుకు ఎవరూ ముందుకు రారే....వయసులో వుండగానే ముచ్చట తీరాలి...' తల్లి బ్రతిమాలి నచ్చచెప్పబోయింది.

'పోమ్మా! నేనసలు పెళ్లే చేసుకోను. ఈ ప్రపంచాన్ని నా చుట్టూ బొంగరంలాగా తిప్పుకోవాలి! అదేనా లక్ష్యం...గమ్యం.... దీన్ని తప్ప మరో విషయం గురించి ఆలోచించను. దట్సాల్. పెళ్ళి పెళ్లని నా వెంటపడి వేధించద్దు. నీకు ఇదే లాస్ట్ వార్నింగ్... కేట్‌వాక్ నడకతో తన ఎ.సి. బెడ్‌రూమ్‌లోకెళ్లింది.

'మన అనుష్కకి అందాల పోటీ పిచ్చెక్కువైంది. అది మన మాట మన్నించుకునే స్థితిలో లేదు. అతిగారాబంతో దాన్ని మీరట్లా తయారు చేశారు...' భర్తతో నిష్టూరంగా అంది దేవకి.

'దేవకి! ఇవి మన రోజులు కావు. ఈతరం ఆడపిల్లలు మనం చెప్తే వినేట్టలేరు. వాళ్ల అభిరుచులకు అనుగుణంగా మనం నడుచుకోవలసిన పరిస్థితి! అర్థమైందా?! రెడ్డి గారు పేపరు చదువుతూ భార్య అందించిన కాఫీ సిప్ చేస్తూ మాట్లాడాడు.

'అది చిన్నపిల్ల! మన మాట వినటం లేదని దాని మానానికి దాన్ని వదిలేసి...అది ఏం చేసినా కళ్లు అప్పగించి చూస్తుంటామా? అదే నా కన్న వారిగ మన భాధ్యత? అంతా మనల్నే ఆడిపోసుకుంటారు. మీకేం? మగాళ్లు.

'అది చిన్న పిల్లేం కాదే! చెవి మేలేసి చెప్పటానికి! నేటి భారతదేశపు ఆదర్శమహిళే అది! ఇంత వరకూ అది చేస్తున్న పనుల్లో నాకు తప్పేమీ కన్పించడం లేదు. అందుకే... దాని గమ్యం చేరటం కోసం నా వంతు సాయం అందిస్తున్నానే పిచ్చిదానా. ఖాళీ కప్పు ఇచ్చేశాడు దేవకికి.

'మీ ధోరణి! నాకేం నచ్చటం లేదు.'

'ఇదుగో... దాని ఎదుట పెళ్లి ప్రస్తావన ఎత్తద్దు. ఆ విషయంలో దాని నిర్ణయం అదే తీసుకుంటుంది! సరేనా?!

'అది పెళ్లి చేసుకునే నాటికి మనం వుంటామో లేదో?'

'అనవసరంగా నస పెట్టకు! నన్ను వంటిగా వదిలేయ్. ఈ రోజు గవర్నమెంట్ భూమి. అక్షనొకటుంది. రెండు మూడు కోట్లు పలుకుతోంది. ఆలాండ్. అసలే వర్రీలో వున్నాను...!

ఇక భర్త తన మాట చెవికెక్కించుకునే పరిస్థితి లేదని గ్రహించి లోపలికెళ్లింది దేవకి!

★★★★★

'ఏమండోయ్... రోండు రోజులైంది అనుష్క ఇంటకొచ్చి. ఎక్కడికెళ్లిందో మీకేమైనా చెప్పిందా? నేనంటే దానికి బొత్తిగా లక్ష్యం లేదు.' టి.వి. చూస్తున్న అచ్చిరెడ్డి నడిగింది దేవకి.

'ఎక్కడో బాత్‌రూమ్‌లోనో....బెడ్‌రూమ్‌లోనో.... వుంటుంది. వెతికేవా? 'ఏకాగ్రతకు భంగం కలగడం ఇష్టంలేక. తల పక్కకు తిప్పకుండానే అన్నాడు.

'ఏంటి జోకా?-అదేమైనా నల్లపూసా ఇంట్లో వుండి కప్పించకపోవడానికి? ఆ టీవీ కట్టేసి నే చెప్పేది  చెవినేసుకోండి కాస్త. తనూ పక్కనొచ్చి కూర్చొని భర్త చేతిలోని రిమోట్ కంట్రోల్ లాక్కొని ఆఫ్ చేసింది.

'బ్రహ్మాండమైన సీను చూస్తుంటే టీ.వీ. కట్టేస్తావా?-కస్సుబుస్సు మన్నాడు దేవకి మీద.

'మీకూ దానికీ వీసమెత్తు భయం లేకుండావుంది. అమ్మాయి కన్పించటం లేదని చెప్తుంటే.., మీరు సినిమా జోకులేస్తారేంటి?-'బుస్సు మంది.

'ఓల్డేజ్ ఆడాళ్లతో ఇదే చిక్కు! నువ్వు నోరుమూసుకో! అమ్మాయి ఏ ముంబాయో...ఢిల్లీనో వెళ్లి ఉంటుంది. వస్తుందిలే..- విమానంలో పోయి రావటమేగా! భయం దేనికి? సరే... మందుకు వేళైంది గానీ.. కప్ బోర్డులో వీస్కి బాటిలు.. ఫ్రిజ్‌లో బిస్లరీ సోడా బాటిల్ వున్నాయి పట్రా.

సతీ సావిత్రి, అరుంధతి, అనసూయ టైప్ పతివ్రత కావటంతో భర్త జారీ చేసిన ఆర్డర్ కాదన్లేక లేచివెళ్లి వాటిని తెచ్చి అచ్చిరెడ్డి ముందున్న టీ పాయ్‌మీద వుంచింది.

"మరి తినటానికేమైనా కావద్దూ....అనే భావన పుట్టిపడేట్టు దేవకి ముఖంలోకి తలెత్తి చూశాడు.

అదీ తెస్తా... ముందు ఈ పని కానీండీ...

అంటూ కిచన్లోకి వెళ్లి ఫ్రైడ్ చికెన్ పీసెస్.. జీడిపప్పు కాసిన్ని పొటాటో చిప్స్...రెండు బాయిల్డ్ ఎగ్స్ తెచ్చింది.

'భర్త మనసెరిగి మెలుగుతావ్ దేవకీ... ఐ లవ్‌యూ... ఐ లవ్‌యూ...' మీదికి లాక్కోబోయాడు.

ముందు వాటి సంగతి చూడండి. తర్వాత నా అంతుచూద్దురుగానీ.... ఓరచూపు విసిరి భర్త చేతుల్లోంచి తప్పించుకుని లోపలికెళ్లింది దేవకి.

మళ్లీ టి.వి. ఆన్ చేసి మందు పుచ్చుకుంటూ స్నాక్స్ తింటూ రిలాక్స్ అవుతున్నాడు రెడ్డి.

రెండో రౌండ్ కాగానే సెల్‌రింగ్‌టోనిచ్చింది. ఈ టైమ్‌లో ఎవరబ్బా అనుకుంటూ రికార్డయిన నెంబర్ చూస్తూ ఇదెక్కడిదో కొత్తనెంబర్...అనుకుంటూ...హలో అన్నాడు.

బంగళాలో కూర్చుని టి.వి. చూస్తూ వైట్‌హార్స్ ఇంపోర్టెడ్ విస్కీ పుచ్చుకుంటున్న అచ్చిరెడ్డిగారూ..నమస్తే!...సినిమా ఫక్కీలో మాట్లాడింది అవతలి కంఠం.

'అయినా..తాను చేస్తున్న కార్యక్రమం వాడికెలా తెల్సింది-'? వండరైనాడు!

'కంగారు పడొద్దు! జర.. నే చెప్పేది వినుకో రెడ్డిసారూ!

'ఎవడ్రా రాస్కెల్ నువ్వు! వేళగాని వేళలో పనీపాటా లేకుండా నీ వేళాకోళమేంటి? సెల్ కట్ చెయ్యిరా ఫూల్. మందులో వున్నాడు కదా! కాస్తంత తిక్కరేగి మాట్లాడాడు.

'ఇదో... నీ పోరి... అదేంపేరు... అనుష్క! సినిమా యాక్టర్ లెక్క వుంది పోరిపేరు. నీ కూతురే కదూ? మస్తుగుంది రసగుల్లాగా...పుల్లారెడ్డి స్వీట్సులో లడ్డుమల్లె. బలే సెక్సీగావుంది.... ఏం పోసి కన్నావుబే నీ కూతుర్ని...బంగారు బొమ్మలెక్కుంది.

ఫోన్లో మాటలు అసహ్యంగా...ఛండాలంగా వున్నాయ్. ఓ వైపు కడుపులో విస్కీమందు... రెండో వైపు వాడు ఫోన్లో వాడే అవాకులు చెవాకుల తాటాకుమంట...భగ్గున మండినట్టయింది అచ్చిరెడ్డికి.

"నీముచ్చటతర్వాత...ముందు నామాట వినుకో!

అచ్చిరెడ్డి గుండె లయతప్పింది...వాడు మాట్లాడుతోంది నిజమా..? అబద్ధమా.?

"ఇంట్లో నువ్వొక్కడివే ఎంజాయ్ చేస్తుంటే... ఇక్కడ నలుగురం కలిసి పోరితో ముచ్చటగా గేమ్స్ ఆట ఆడుకునాలా. నీ కూతురు కోడిపలావు లెక్కవుందనుకో...కాదు కాదు... వేట మాంసం టేస్ట్‌లో వుందనుకో... బలే మజాగావుంది...?

అచ్చిరెడ్డికేం చేయాలో తోచలేదు. వాడు చెప్పేది నిజమైతే...తన బంగారు తల్లి జీవితం నాశనమౌతుంది. పోనీ పోలీసులకు రిపోర్టు ఇస్తే...? ఎ.సి.పి. తన అన్న కొడుకే.

'అనుష్క ఎక్కడుందో? ఎలా వుందో. ఇదంతా నిజమో...డబ్బుకోసమో... బెదిరింపో.... ఏమీ తెల్సుకోకుండా ఏ.సి.పి.కి ఫోన్ చేస్తే మాత్రం ఏమిటి ప్రయోజనం అన్పించింది అంతలోనే!

'ఓరేయ్... ఎవర్రామీరు?... మీరు డబ్బుకోసమే నా కూతుర్ని కిడ్నాప్ చేస్తే చెప్పండి. కోట్లు కోరినా ఇస్తాను. నా బంగారు తల్లినేం చేయకండి.' స్థాయి దిగి మాట్లాడేడు.

"అరె చుప్! నీ డబ్బెవరికి కావాలిబే! పోరిని చేజిక్కించుకోవాలనీ... తనివితీరా అనుభవించాలిగానీ..మేం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాం.... అవకాశం ఇప్పటికి చిక్కింది. వలలో కోడిపిల్ల లెక్క నీ బిడ్డ మా చేతిలో చిక్కింది...

'ఒరే రాక్షసుల్లారా... మీకేంకావాలంటే అది ఇస్తాను. నా అనుష్కకి అపకారం తలపెట్టకండి...! రోదించాడు.

'చుప్‌బే సాలే! నువ్వు బయల్దేరి సాగర్ రూట్లో ఇరవయ్యో మైలురాయి కాడి కొచ్చేక.. నీ పోరిని తీసుకెళ్లు..' సెల్ కట్ అయ్యింది.

ఉన్నపళంగా కారులో బయల్దేరాడు అచ్చిరెడ్డి ఇంట్లో వున్న భార్యకైనా చెప్పకుండా!

కారు శరవేగంతో డ్రైవ్ చేస్తున్నాడు. ఆలోచనలు తనను భయపెడ్తున్నాయ్. గందరగోళ పరుస్తున్నాయ్. చిన్నారి చిట్టి తల్లికి ఏం అపకారం జరుగలేదుకదా?... ఇరవయ్యో మైలురాయి వచ్చింది.

అక్కడ అనుష్కగానీ ఇతరులు గానీ కన్పించలేదు. కారు దిగి చుట్టూచూసాడు. దగ్గర్లోనున్న కల్వర్టుమీద గోతం మూట కన్పించింది.

విప్పిచూసాడు. పై ప్రాణం పైనే పోయింది రెడ్డికి. కూతురు శవాన్ని ముక్కలు ముక్కలుగ కోసి గోతంలో మూట కట్టడంతో నెత్తురుతో గోనెసంచి తడిసివుంది.

ఎంత దారుణం? ఎంత అమానుషం?వాళ్లు మనుషులు కారు రాక్షసులు!

ఒంటరిగా రోదిస్తూ....గుండెబాదుకుంటూ... అక్కడే కుప్పకూలాడు అచ్చిరెడ్డి!

ఇదొక ఆడపిల్లతండ్రి రోదన! ఆక్రందన!

-: సమాప్తం :-